


# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూలై 21, 2026 | సంపుటి : 2 | సంచిక : 279 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

- ♦ దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది
- ♦ విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం
- ♦ పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూలై20 :**
పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు.


మిగతాది 2లో

## దేవాదాయ శాఖలో డిజిటలీకరణ
# మంత్రి కొండా సురేఖ వెల్లడి



**హైదరాబాద్,జులై 20**
దేవాదాయ శాఖ పరిధిలోని పరిపాలనను పూర్తిస్థాయిలో డిజిటలీకరణెళి ప్రభుత్వ లక్ష్యమని ఆ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ధార్మిక సంస్థలు, దేవాలయాల చట్టం - 2025 డ్రాఫ్ట్‌పై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖలో డిజిటల్ సంస్కరణలకు దిశానిర్దేశర చేశారు. ఎండోమెంట్ వ్యవస్థకు మరిన్ని మెరుగులు దిద్దాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. భక్తులకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. దీనిపై అధికారుల ప్రజెంటేషన్‌కు మంత్రి కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు డ్రాఫ్ట్ రూల్స్‌పై సుదీర్ఘంగా సమీక్షించారు. ట్రస్ట్ బోర్డు పనితీరు పారదర్శకంగా ఉండేలా నియమావళి రూపొందించాలని సూచించారు. దేవస్థానాల పరిపాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులకు వివరించారు. యాదగిరిగుట్ట - వేములవాడ దేవాలయాల్లోని సిబ్బంది పరస్పర బదిలీలపై మంత్రి సురేఖకు ఈ సందర్భంగా ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతోపాటు వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండా సురేఖ వివరించారు.




## బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్.. తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్:**
రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడ భూముల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు సోమవారం (జూలై 20) కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ భూములకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేస్తూ అభ్యంతరాలపై స్టే విధించింది.

2 లో



## ట్రైనీ IPS ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపుల కేసులో బిగ్ ట్విస్ట్!

**హైదరాబాద్:**
ట్రైనీ ఐపీఎస్ అధికారి ఎం.ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. తనపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అయితే, ఆత్మహత్యాయత్నానికి ముందు ట్రైనీ ఐపీఎస్ రాసిన సూసైడ్ లేఖ తాజాగా వెలుగులోకి వచ్చింది.



## క్యూర్ పరిధిలో
# ఇందిరమ్మ ఇళ్లు

- ♦ ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ
- ♦ రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- ♦ ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు

**హైదరాబాద్,జూలై20**
క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

మిగతాద్ది 2 లో

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం
## వెల్ఫేర్ సొసైటీ సమీక్షలో డిజిపి సివి ఆనంద్



2 లో

**హైదరాబాద్,జులై 20 :**
పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే తెలంగాణ పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్స్పష్టం చేశారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ , ఆరోగ్య భద్రత విభాగాల సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, వాటి పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించేందుకు శాఖ అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పోలీసు పిల్లల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే జేఈఈ, నీట్‌తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో
# రక్షణ లేకుండా పోయింది



- » ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు
- » బాన్సువాడ ఘటనపై స్పందించన ప్రభుత్వం
- » నిమ్స్‌లో బాలింతను పరామర్శించిన హరీష్ రావు

**హైదరాబాద్,జూలై20 :**
ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు.

2 లో

## ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!

- ▪ కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ▪ డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం
- ▪ ఉద్యోగులంతా కలసి సమీకరించిన ధనం చెక్కు రూపంలో అప్పగింత
- ▪ కార్మికుల కృషిని అభినందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,జూలై 20 :**
టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



మిగతాది 2లో



2లో..

## మేడిగడ్డ మరమ్మతులకు
# రంగం సిద్ధం...

- ▪ చివరి దశకు చేరుకున్న పరీక్షలు
- ▪ నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- ▪ భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ
- ▪ శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం
- ▪ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూలై 20 :**
కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.



2లో..

## బాన్సువాడలో
# మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

- ▪ పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టిగా బుద్ధి చెప్పాలి
- ▪ ఏ పార్టీలో ఉన్నాడో కూడా తెలియని స్థితిలో పోచారం
- ▪ పార్టీలో చేరిన బాన్సువాడ నేతలకు కెటిఆర్ ఆహ్వానం

**హైదరాబాద్,జూలై 20 :**
బాన్సువాడలో కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## 'సర్' పేరిట భాజపా సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారు: రామచందర్‌రావు



**హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డిని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో నేతలు కలిశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 'సర్'పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పాతబస్తీలో సర్ నిర్వహణకు సీనియర్లకు బాధ్యత అప్పగించాలని రామచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భాజపా సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారంటూ సీఈవోకు ఆయన ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కై అనర్హులను చేరుస్తున్నారని ఆరోపించారు. ఉత్తర భారతదేశం నుంచి వలస వచ్చినవారికి ఓటు హక్కు లేకుండా చేస్తున్నారని సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

మొదటిపేజీ తరువాయి

క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్దిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని
వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు.

చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒఎఉ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఎ÷–లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అజఖీఇలో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల ముందు అజఖీఇలో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు. మళ్లీ వచ్చే బోనాల నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

మొదటిపేజీ తరువాయి

గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్–1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్–1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్–1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. గతంలో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పెద్దాయన పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్‌లో చేరి కుడిదిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు. ఈ సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారనని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్‌లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు వెళ్తే ప్రభుత్వం మాత్రం 'కోల్డ్ స్టోరేజ్'లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే కాదు ప్రాణాలు కూడా ఇస్తామని బీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పిందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!

మొదటిపేజీ తరువాయి

నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరఫున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు. గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను
ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు ఎంఎంటిసి సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒక ఉద్యోగి కష్టంలో ఉంటే మొత్తం సంస్థ అండగా నిలవాలనే గొప్ప సంస్కృతి టీజీఎస్ ఆర్టీసీ సొంతమని, ఈ కార్యక్రమం ఆ విలువలను మరోసారి చాటిచెప్పిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి ఉందని, సిబ్బందికి అవసరమైన భద్రత, శిక్షణ, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతర చర్యలు తీసుకుంటున్నామని ఎండీ స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి డ్రైవర్, కండక్టర్ అత్యంత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థ ఆర్థిక బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని యాజమాన్యం విశ్వసిస్తోందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగుల క్రమశిక్షణ, సేవాభావం, టీమ్‌వర్క్ అత్యంత అవసరమని, ప్రతి ఉద్యోగి సంస్థ ప్రతిష్ఠను పెంచేలా ప్రజలకు సేవలు అందిస్తే టీజీఎస్ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శవంతమైన ప్రజా రవాణా సంస్థగా ఎదుగుతుందని ఎండీ నాగిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దివంగత కోల శంకర్ సతీమణి హేమలత మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని నిలబెడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న తన భర్త శంకర్‌గౌడ్ కోరికను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుఆర్టీసీ యూనియన్ నాయకులు, పలువురు ఉన్నతాధికారులు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో
# రక్షణ లేకుండా పోయింది

మొదటిపేజీ తరువాయి

ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. బాలింతల నుంచి పాలు తాగడం వల్ల నీలోఫర్‌లో పసిగుడ్డులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు పూర్తిగా కోలుకోకుండా పసిగుడ్డులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరుగురికి 10వ తేదీన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. థియేటర్ మెయింటెనెన్స్ సరిగ్గా లేక ఇన్‌ఫెక్షన్ సోకిందని బాధితులు అంటున్నారని అన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కూడా కారణమని అంటున్నారని అన్నారు. కాలం చెల్లిన మందులు వాడినందుకే ఈ పరిస్థితి వచ్చింటున్నారని తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. వైద్యారోగ్య అధికారులు కనీసం పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. ఘటన నుంచి గురించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించలేదని అన్నారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక పేషెంట్ నగలు అమ్మి, అప్పు తెచ్చి వైద్య చికిత్సలు చేయించామని కుటుంబీకులు చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కేసీఆర్ హయాంలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్, బాలింతలకు కేసీఆర్ కిట్‌లు ఇచ్చామని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. అమ్మ ఒడి వాహనాల్లో బాలింతలను సురక్షితంగా ఇళ్లకు చేర్చామని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు గణనీయంగా తగ్గాయని అన్నారు.

## మేడిగడ్డ మరమ్మతులకు
# రంగం సిద్ధం...

మొదటిపేజీ తరువాయి

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ , కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పునరుద్ధరణ పక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు.

÷–రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

### ట్రైనీ IPS ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపుల కేసులో బిగ్ ట్విస్ట్!

మొదటిపేజీ తరువాయి

తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి తనపై చేసిన లైంగిక వేధింపులు పూర్తిగా అవాస్తవమని ఉదయ్ కృష్ణారెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు.

తాను సదరు బ్యాచ్‌మేట్ (కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపీఎస్)తో గత ఏడాది కాలంగా రిలేషన్‌లో ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. ఆమెకు వివాహమైన తర్వాత కూడా తమ ఇద్దరి మధ్య ఈ బంధం కొనసాగిందని వెల్లడించారు. ఈ క్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారిణే స్వయంగా తన గది వద్దకు వచ్చి తలుపు తీయమని గొడవ చేసిందని, దీనికి సంబంధించిన పూర్తి వీడియో ఆధారాలు తన మొబైల్ ఫోన్‌లో ఉన్నాయని వివరించారు.

వారి మధ్య ఉన్న రిలేషన్, వివాదానికి సంబంధించిన అన్ని విషయాలను మహిళా ట్రైనీ ఐపీఎస్ భర్తకు కూడా వివరించినట్లు పేర్కొన్నారు. ఈ సంభాషణలు, చాటింగ్‌లు, వీడియోల తాలూకు అన్ని రకాల నిరూపణలు తన ఫోన్‌లోనే భద్రంగా ఉన్నాయని, వాటిని పరిశీలిస్తే నిజానిజాలు తెలుస్తాయని లేఖలో వెల్లడించారు. ప్రస్తుతం ఉదయ్ కృష్ణారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఈ సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు కేసును సరికొత్త కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్.. తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బహదూర్‌గూడ పరిసర ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభించింది. అయితే, సదరు భూసేకరణ పరిధిలోని సర్వే నంబర్ 3, 4లలో ఉన్న 28 ఎకరాల భూమి తమదేనంటూ నలుగురు స్థానిక రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

తాతముత్తాతల కాలం నుంచి ఆ భూములు తమ సాగులోనే ఉన్నాయని, సరైన పరిహారం, చట్టపరమైన నోటీసులు ఇవ్వకుండా భూసేకరణ చేయడం చెల్లదంటూ వారు పిటిషన్ దాఖలు చేశారు. రైతుల తరఫు న్యాయవాది వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. వివాదంలో ఉన్న 28 ఎకరాల భూమిపై ప్రస్తుతానికి యథాతథంగా ఉంచాలని ప్రభుత్వానికి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు అక్కడ ఎలాంటి పనులు లేదా భూసేకరణ చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం
## వెల్ఫేర్ సొసైటీ సమీక్షలో డిజిపి సివి ఆనంద్

మొదటిపేజీ తరువాయి

సిబ్బందికి వివాహ రుణాలు, వైద్య రుణాలు, విద్యా రుణాలు, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు, అదనపు కార్పస్ ఇన్స్యూరెన్స్, వివిధ గ్రాంట్లు వంటి సంక్షేమ పథకాల ద్వారా సమగ్ర ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు డీజీపీ వివరించారు . వెల్ఫేర్ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని, హోదాల వారీగా వెల్ఫేర్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. శాఖకు చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌ల అద్దె రేట్లను పారదర్శకంగా నిర్ణయించి, సిబ్బందికి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా లీజుకు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో డీజీ మహేష్ ఎం. భగవత్, ఏడీజీ సంజయ్ జైన్, షహనవాజ్ ఖాసిం, గజరావు భూపాల్, ఉదయ్ కుమార్ రెడ్డి, శరత్ కుమార్, గోపీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్ జన్మదినాన నిరుద్యోగులకు భరోసా.. జులై 22న ఉచిత శిక్షణ కార్యక్రమం

- కేటీఆర్ నిరుద్యోగ భరోసా'తో యువతకు చేయూత.. జులై 22న హనుమకొండలో భారీ కార్యక్రమం
- ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, యాప్ ప్రారంభం






**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 20**
తెలంగాణలో నిరుద్యోగ యువతకు అండగా నిలిచి వారికి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని 'కేటీఆర్ నిరుద్యోగ భరోసా' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని జులై 22న హనుమకొండలోని న్యూ రాయల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రముఖ విన్నర్స్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించడంతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ లెర్నింగ్ యాప్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ మోటివేటర్ డా. ఆకెళ్ల రాఘవేంద్ర ముఖ్య అతిథిగా హాజరై యువతకు మార్గదర్శనం చేయనున్నారని తెలిపారు. అలాగే బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.
ఈ సందర్భంగా డా. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలో ఐటీ రంగంలో అగ్రస్థానానికి చేరుకుందని, పారిశ్రామిక రంగంలోనూ రాష్ట్రం ముందంజలో నిలిచిందన్నారు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం టాస్క్, టీ-హబ్, టీ-వర్క్స్ వంటి సంస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాల సృష్టికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో లక్షా 62 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నిరాశపరిచిందని విమర్శించారు. ఇప్పటివరకు కేవలం 11 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. ఉద్యోగాల అంశంపై ఎలాంటి చర్చకైనా తాము సిద్ధమని స్పష్టం చేశారు. ఇటీవల కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన "యువ సంగ్రామ సభ"కు విశేష స్పందన లభించిందని, అదే స్ఫూర్తితో ఇప్పుడు నిరుద్యోగ భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ, కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా డా. వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం అభినందనీయమన్నారు. దాదాపు రూ.20 వేల విలువైన ఆన్‌లైన్ లెర్నింగ్ యాప్‌ను నిరుద్యోగులకు ఉచితంగా అందించడం గొప్ప నిర్ణయమని కొనియాడారు. పేద, మధ్యతరగతి యువత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డా. కొమురయ్య మాట్లాడుతూ.. ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని నిరుద్యోగ యువత తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. డా. వీరేందర్ మాట్లాడుతూ, ఈ యాప్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు, ఉద్యోగార్థులు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. రవి నాయక్, రామ్మూర్తి, శరత్ చంద్ర మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లకు నియామక పత్రాలు అందించి వాటినే తమ విజయంగా చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాజ్‌కిశోర్, డా. కంజర్ల మనోజ్, రాకేష్ యాదవ్, వీరస్వామి, రాజగోపాల్, రమేష్ నాయక్, కోరపెల్లి రాజేష్, పానుగంటి శ్రీధర్, అర్షం మధు, పబ్బోజు శ్రీకాంత్ చారి, తక్కళ్లపల్లి వినీల్ రావు, రాము, సందీప్ యాదవ్, రాసూరి రాజేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది: టీఎంపీఎస్
- ఉద్యమంలో త్యాగాలు చేసిన వారికి గౌరవం, గుర్తింపు, సంక్షేమం కల్పించాలి
- టీఎంపీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న)



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 20**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడిన నిజమైన ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ మాల పోరాట సమితి (టి యం పి ఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, మహిళలు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు తమ వంతు పాత్ర పోషించారని, వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా వేలాది మంది ఉద్యమకారులు పోలీసు కేసులు ఎదుర్కొన్నారని, జైలు శిక్షలు అనుభవించారని, లాఠీచార్జీలు, అరెస్టులు, వేధింపులకు గురయ్యారని గుర్తు చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అనేక మంది విద్యార్థులు తమ విద్యను మధ్యలోనే వదులుకోవాల్సి వచ్చిందని, ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి సముచిత గౌరవం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిజమైన ఉద్యమకారుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు. ఉద్యమ కారులకు న్యాయం చేస్తామని పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఫలితంగా అనేక మంది ఉద్యమకారులు ఇప్పటికీ ఆర్థిక, సామాజిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమ కారులకు ప్రత్యేక గుర్తింపు, సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, పెన్షన్, ఉపాధి అవకాశాలు, ఉద్యమ కేసుల ఉపసంహరణ, ఉద్యమంలో గాయపడిన వారికి ప్రత్యేక సాయం, అమరుల కుటుంబాలకు మరింత చేయూత వంటి పలు హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీలను ఆలస్యం చేయకుండా దశలవారీగా అమలు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయాలని వెంకన్న కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వాములైన ప్రతి ఉద్యమకారుడి వివరాలను సేకరించి అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ లేదా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు అదనపు ఆర్థిక భద్రత కల్పించాలని, ఉద్యమంలో గాయపడిన వారికి ఉచిత వైద్యం, ఉద్యోగాలు, గృహ సౌకర్యాలు, పిల్లలకు విద్యా సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలియజేసేలా ప్రత్యేక మ్యూజియంలు, స్మారక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, ప్రజా గాయకులు, సామాజిక కార్యకర్తలకు తగిన గుర్తింపు, పురస్కారాలు అందించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను విస్మరించడం అంటే తెలంగాణ ఆత్మను అవమానించినట్టేనని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు, ముఖ్యంగా ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేసి, తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని తెలంగాణ మాల పోరాట సమితి (టి.ఎం.పి.ఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమ కారుల హక్కుల సాధన కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్

- 23వ డివిజన్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పనులపై క్షేత్రస్థాయి సమీక్ష




**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూలై 20**
వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కొత్తవాడ 23వ డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు దరఖాస్తుల పూరణ, పూరించిన దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులకు అందజేయడం, వారి వద్ద ఉన్న గణన పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వారు దగ్గరుండి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 7, 9 బూత్‌ల పరిధిలో ప్రత్యేక సవరణ ప్రక్రియ పురోగతి ఇప్పటికే 65 శాతానికి చేరుకుందని తెలిపారు. మరణించిన వారి పేర్ల తొలగింపు, ద్వంద్వ ఓట్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాల నమోదు వంటి ప్రక్రియలను పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే పురోగతి 92 శాతానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు శ్రమిస్తున్న బూత్ స్థాయి అధికారులు ముంద్రాతి మమత, రాజేశ్వరి సేవలను వారు అభినందించారు. అలాగే సహకారం అందించిన 23వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి చిప్ప వెంకటేశ్వర్లు నేత, డివిజన్ అధ్యక్షుడు దామెర రాజ్ కమల్, రావుల రాజీవ్, కలకోట గీత--భాస్కరాచారి, ముంద్రాతి వెంకటేశ్వర్లు, రాసమల్ల రాజు తదితరులను అభినందించారు.

# కరెంట్ షాక్‌తో మూడు మేకలు మృతి.. బాధిత రైతుకు నష్టపరిహారం ఇవ్వాలి: కొయ్యడ సునీల్

- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొయ్యడ సునీల్
- ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్



**కరపత్రం ప్రతినిధి హసన్‌పర్తి, జూలై 20**
హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొయ్యడ రాజు పెంచుకుంటున్న మూడు మేకలు సోమవారం ఉదయం కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి. ఈ ఘటన విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని బాధితుడు ఆరోపించారు. సమాచారం అందుకున్న వెంటనే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు కొయ్యడ సునీల్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కొయ్యడ సునీల్ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి బాధిత రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రమాదం జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వెంటనే రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, గ్రామ ప్రజలు, పశువుల భద్రతకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. కాగా, ఘటన జరిగిన గంట వ్యవధిలోనే విద్యుత్ శాఖ సహాయ ఇంజనీరు (ఏఈ) సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి శాఖ తరపున సాధ్యమైన ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధంపై ఐవైఎం నిరసన ర్యాలీ






**కరపత్రం ప్రతినిధి వరంగల్/హనుమకొండ,జూలై 20**
ప్రముఖ-శాస్త్రవేత్త,విద్యావేత్త,సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు నిర్బంధించడాన్ని నిరసిస్తూ వరంగల్ ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఐవైఎం ఆధ్వర్యంలో హనుమకొండలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి అదాలత్ చౌరస్తా వరకు జరిగిన ర్యాలీలో యువత, విద్యార్థులు,వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలని,భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించాలని,దేశ విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని నినాదాలు చేశారు.ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడిన దర్గా ఖాజీపేట్ పీఠాధిపతి వారసుడు సయ్యద్ ముహమ్మద్ బఖ్తియార్ బాయాబానీ,ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ నాయకులు ముహమ్మద్ షాబాజ్,ముహమ్మద్ షమ్స్ మాట్లాడుతూ.. దేశ విద్యా వ్యవస్థ ప్రస్తుతం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని,మౌలిక సంస్కరణలు అత్యవసరమని పేర్కొన్నారు.నీట్ పరీక్ష పేపర్ లీక్‌ల వంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని,పరీక్షా విధానంపై ప్రజల విశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తున్నాయని అన్నారు.విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత,జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించాలని,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యువత,విద్యార్థులు,ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ శాంతియుత,ప్రజాస్వామ్యబద్ధ పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ నాయకులు సయ్యద్ నిజాముద్దీన్,షేక్ ఖలీల్ రబ్బానీ,ముహమ్మద్ సద్దాం,స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(ఎస్.ఐ.ఓ),ఎంపీజే,విద్యార్థులు,సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# అడప మహేష్ అంతిమయాత్రలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు..

- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాడె మోసిన ఎమ్మెల్యే
- దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ
- మహేష్ సేవలను గుర్తుచేసుకుంటూ నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 20**
వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అడప మహేష్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన అంతిమయాత్రలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని మహేష్ పాడె మోసి నివాళులర్పించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, మహేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్, హన్మకొండ డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, ఇనగాల వెంకట్రాం రెడ్డి, హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్ తదితరులతో కలిసి మహేష్ మృతదేహానికి పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ..మహేష్ వంటి నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, అధిష్ఠానం అందించే సహాయంతో పాటు తన వ్యక్తిగతంగా కూడా కుటుంబానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. మహేష్ మృతికి కారణమైన ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని వారికి తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహేష్ పార్టీ కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని మహేష్ కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అడప మహేష్‌కు ఘనంగా తుది వీడ్కోలు పలికారు.

# అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ సిజెపిని చర్చలకు పిలిచిన జెపి నడ్డా

సిజెపి కార్యకర్తల చలో పార్లమెంట్ పిలుపుతో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్లమెంట్ భవనం లోపల వీరి భేటీ జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. 'చలో పార్లమెంట్' వేళ ఈ నిరసనలనకు నాయకత్వం వహిస్తున్న నాయకులతో కేంద్రమంత్రి జేపీ నడ్డా భేటీ అయ్యారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ కూడా వారితో మాట్లాడుతున్నారు. మరోవైపు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జేపీ నడ్డా కలవనున్నారని సమాచారం. పరీక్షల నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చిందని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సోమవారం ప్రకటించింది. తమ డిమాండ్లను వివరించేందుకు ఇద్దరు అధికార ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ కానున్నట్లు సీజేపీ వెల్లడించింది. అయితే.. ఈ చర్చల అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదిలా ఉండగా.. పరీక్షల అవకతవకలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది సీజేపీ కార్యకర్తలు, నిరసనకారులు ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపునకు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించగా భద్రతా బలగాలు అడ్డుకున్నాయి.

# గిరిజన బాల, బాలికల కోసం నూతన వసతిగృహం ఏర్పాటు చేయాలి



డిఆర్ఓ కె. అద్దెయ్య కు వినతి పత్రం అందజేత
గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్

**కరపత్రం ప్రతినిధి నరసరావుపేట, జూలై 20 :**
పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని తపాలా కార్యాలయం (పోస్ట్ ఆఫీస్) వెనుకాల ఉన్నటువంటి గిరిజన బాల, బాలికల వసతి గృహం గదులు తక్కువగా ఉన్నందున సరిపోవడం లేదు, ఉన్నతమైన విద్యను అభ్యసించేందుకు బాల, బాలికలు నరసరావుపేట కు ఎక్కువగా వస్తున్నారు అని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి అన్నారు. ఇటీవల కాలంలో గదులు ఖాళీలు లేకపోవడంతో అద్దెలకు తీసుకొని ఉండాల్సిన దుస్థితి బాలికలకు నెలకొంది అని ఆయన అన్నారు. బాల, బాలికల కోసం తక్షణమే నూతన వసతి గృహం ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా డీఆర్వ్ కె. అద్దెయ్యకు గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మీడియాతో మాట్లాడుతూ, గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో ఏటువంటి కళాశాలలు లేకపోవడం వలన నరసరావుపేటలోని ఉన్నతమైన విద్యను అభ్యసించేందుకు బాలికలు ఆసక్తి చూపుతున్నారని ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి గిరిజన బాల, బాలికులకు గిరిజన వసతి గృహం ఏర్పాటు అయ్యే విధంగా చూడాలన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు నాయక్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..? కేరళ స్కూల్ యాజమాన్యంపై తీవ్ర ఆరోపణలు

సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు --
వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని
పుల్లూరి కుమార్ మాదిగ డిమాండ్

**జమ్మికుంట, జూలై 20 కరపత్రం ప్రతినిధి**
విద్య అనేది ప్రతి చిన్నారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అయితే జమ్మికుంట పట్టణంలోని కేరళ స్కూల్ యాజమాన్యం ఆ హక్కుకే తూట్లు పొడుస్తోందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. స్కూల్‌లో చదువు మానేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), స్టడీ సర్టిఫికెట్, బోనాఫైడ్ తదితర విద్యా ధ్రువపత్రాలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కుమార్ మాదిగ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎమ్మార్వోకు ఆయన లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు కొత్త పాఠశాలల్లో ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలంటే పాత పాఠశాల నుంచి అవసరమైన ధ్రువపత్రాలు తప్పనిసరిగా అవసరం. అయినప్పటికీ కేరళ స్కూల్ యాజమాన్యం ఆ సర్టిఫికెట్లను ఇవ్వకుండా రోజులు గడుపుతూ విద్యార్థులను కార్యాలయాల చుట్టూ తిప్పుతోందని ఆయన ఆరోపించారు. పలుమార్లు యాజమాన్యాన్ని సంప్రదించినా సరైన స్పందన లేకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే హక్కు ఏ విద్యాసంస్థకూ లేదని పుల్లూరి కుమార్ మాదిగ అన్నారు. ఒక విద్యార్థి ఏ పాఠశాలలో చదవాలనేది పూర్తిగా తల్లిదండ్రుల నిర్ణయమని, మరో పాఠశాలలో చేరుతున్నారనే కారణంతో సర్టిఫికెట్లు నిలిపివేయడం చట్టవిరుద్ధమైన చర్యగా భావించాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యల వల్ల విద్యార్థులు సమయానికి ప్రవేశాలు పొందలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వారి చదువులకు ఆటంకం కలుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి దురదృష్టకరమన్నారు. కేరళ స్కూల్ యాజమాన్యం వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి, సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసినట్లు తేలితే సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బాధిత విద్యార్థులకు వెంటనే అన్ని విద్యా ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని, విద్యార్థుల హక్కులను హరించే యాజమాన్యాలపై ఉపేక్ష చూపకూడదని పుల్లూరి కుమార్ మాదిగ విజ్ఞప్తి చేశారు.



# దుర్గాభవానీ అమ్మవారికి కాకర కాయల మాలలతో అలంకరణ

◆ విశేష హారతులు, ప్రత్యేక పూజలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో జరుగుతున్న ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలలో భాగంగా ఆరోవ రోజైనా సోమవారం శ్రీదుర్గాభవానీ అమ్మవారిని కాకర కాయల మాలలతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు పవనకష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గోన్నారు.



# దుబాయ్ ఈ టి సి ఎ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
యూఏఈలోని రాస్ అల్ ఖైమా మైత్రి ఫార్మ్‌లో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూఏఈలోని వివిధ ఎమిరేట్స్‌ల నుంచి సుమారు 400 మంది తెలంగాణ ప్రవాసులు కుటుంబ సమేతంగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ టి సి ఎ ఆధ్వర్యంలో వరుసగా నాలుగోసారి నిర్వహించిన ఈ వేడుకలో గౌరమ్మ పూజ, బోనాల సమర్పణ, కుంకుమార్చన, మహాహారతి, దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టు చీరలు ధరించిన మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ నిర్వహించిన ఊరేగింపు, ఒగ్గ డోలు మోతలు, పోతురాజుల విన్యాసాలు తెలంగాణ సంస్కృతిని విదేశీ నేలపై ఆవిష్కరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైత్రి గ్రూప్ వ్యవస్థాపకులు కొత్త జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, విదేశాల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తున్న ఈ టి సి ఎ సభ్యులను అభినందించారు. ఈ టి సి ఎ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్ రావు మాట్లాడుతూ, విదేశాల్లో జన్మించిన భావితరాలకు తెలంగాణ పండుగల గొప్పతనాన్ని పరిచయం చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం భక్తులందరికీ మహాప్రసాదం పంపిణీ చేసి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విదేశాల్లో ఉన్నామనే భావన కలగకుండా స్వగ్రామంలో బోనాలు జరుపుకున్న అనుభూతి కలిగిందని తెలంగాణ ప్రవాసులు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ టి సి ఎ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్ రావు చీటీ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఎలిగేటి, ప్రధాన కార్యదర్శి రాణి కొట్ల, సంయుక్త కార్యదర్శి శేఖర్ గౌడ్ గుండవేని, కోశాధికారి తిరుమల్ రావు బీరెల్లి, మాజీ




అధ్యక్షులు రాధారపు సత్యం, సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్ రావు, ఎస్.పీ. కస్తూరి, సురేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వినోద్ ఆచారి, రఘు ఎలిగేటి, రాము కందుకూరి, సామ శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ పోలంపల్లి, కిరణ్ చెట్టిగారి, సారిక పీచర, మమత కస్తూరి, అన్నపూర్ణ, మౌనిక గౌడ్, మధు కుమార్, వనజ గోగుల, రనీషా, విపుల, స్వప్న, దీపిక తదితరులు, మహిళా విభాగ సభ్యులు, వాలంటీర్లు మరియు యూఏఈ నలుమూలల నుంచి వచ్చిన తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా నిర్మాణాలు..

## విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపాలిటీ 11వ వార్డు పరిధిలోని సర్వే నంబర్లు 1403, 1404లో పురపాలక శాఖ అనుమతులు లేకుండా అక్రమ భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, దీనిపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త వెంగళ శ్రీకాంత్ గౌడ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫోటోలను జత చేసి వాటిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన భవన యజమానులు, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నీట్ పేపర్ లీక్‌పై సీపీఎం,ఎస్‌ఎఫ్‌ఐ నిరసన



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వేములవాడ పట్టణంలోని చెక్కపల్లిలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కడారి శివ మాట్లాడుతూ, ఢిల్లీలో శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రామంచ అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ నిధులను 80 మంది లబ్ధిదారులకు 38 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్ నియోజవర్గ ప్రజలకు ఒక అన్నగా తల్లిదండ్రులకు కొడుకుగా అందరికీ ఆపద్బాంధవుగా ఉంటాను
నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధి తమ ధ్యేయంగా కాంగ్రెస్ పరిపాలన సాగిస్తాను
నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల అండ దండలే తనకు ఆరాధ్య దైవంగా భావిస్తాను

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జులై 20**
మెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సోమవారం నాడు నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణా గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.38 లక్షల విలువైన చెక్కులను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి లబ్ధిదారులకుఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని వారుతెలిపారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని 5వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ప్రారంభించారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. తదుపరి నర్సాపూర్ పట్టణంలోని 1వ వార్డులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమీక్షించి, బూత్ స్థాయిలో జరుగుతున్న పనులపై నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. నర్సాపూర్ మున్సిపల్ నూతన భవనాన్ని పరిశీలించి, భవనంలో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు మిగిలిన పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే ఆలోచనలను ఉన్నారని తాను కూడా నర్సాపూర్ నియోజకవర్గంలో నీ ప్రజలకు అందరికీ అందుబాటులో ఉంటూ వారి కష్టాలే తన ఇష్టాలుగా ఉంటూ నిరుపేద ప్రజలకు అండదండగా నిలుస్తానని వారి సుఖ సౌభాగ్యాలే తన సౌభాగ్యంగా వ్యవహరిస్తానని నర్సాపూర్ నియోజకవర్గంలోని పేద ప్రజలు సుఖశాంతులతో ఉండాలని తాను ఉంటానని నిరుపేద ప్రజలకు ఎటువంటి బాధలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే తాను తీర్చడానికి ముందస్తులోనే ఉంటానని వారు తెలియజేశారు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన సర్పంచులు ఎటువంటి ఇబ్బందులకు గురి కావద్దని వారి గ్రామాలలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి అని ఆలోచనలను తనకు తెలియజేస్తే వారి యొక్క గ్రామాన్ని సందర్శించి వారి గ్రామ అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తానని వారు తెలియజేశారు ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీనాయకులు ,ప్రజా పతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు స్థానికులు పాల్గొన్నారు.





